కథ

# అమ్మ బ్రతకాలి!

"అమ్మకి ఇప్పుడు ఎలా ఉంది?" ఫోన్‌లో తమ్ముడ్ని అడిగాడు వెంకటేష్.

"బాగానే ఉంది కానీ ఆపరేషన్ చేయక తప్పదు" అన్నాడు సురేష్.

"అమ్మేం చేస్తోందీ... ఒకసారి ఫోన్ ఇవ్వు"

"ఇప్పుడే కునుకు పట్టినట్టుంది పడుకుంది. లేపేదా?"

"వద్దులే. అయినా ఎంతో మందిని ఆదరించి అన్నం పెట్టిన అమ్మకిప్పుడు ఈ కష్టం ఏంటో... అంతా ఆ భగవంతుడి లీల..." వేదాంతం ధ్వనించింది వెంకటేష్ మాటల్లో.

"తప్పకుండా కిడ్నీదాత దొరుకుతాదని నా ఆశ?" నమ్మకంగా అన్నాడు సురేష్.

"దానికోసమేగా మన డాక్టర్ ప్రయత్నం కూడా. ఆపై ఆ భగవంతుడి దయ!" ఆశాభావం వ్యక్తం చేశాడు వెంకటేష్ కూడా.

"ఇంతకీ నువ్వు ఇండియా ఎప్పుడు వస్తున్నావు?" అడిగాడు సురేష్.

"ఇప్పట్లో నాకు కుదరదు. మనీ ట్రాన్స్‌ఫర్ చేస్తా. డబ్బుకి వెనకాడకుండా అమ్మకి ట్రీట్‌మెంట్ ఇప్పించు. మళ్లీ రేపు ఫోన్ చేస్తా. వుంటా..." అని వెంకటేష్ అంటూ ఉండగానే ఫోన్లో బ్యాలన్స్ అయిపోవడంతో లైన్ డిస్కనెక్ట్ అయింది.

ఫోన్ పెట్టి తల్లి వైపు చూశాడు సురేష్. తమ సంభాషణ పట్టనట్టు నిద్రపోతున్న తల్లిని చూస్తే ఒక వైపు దుఃఖం ముంచుకొచ్చింది. తన తల్లికి తెలుసు ఆమెకొచ్చిన జబ్బేమిటో... కిడ్నీ ఫెల్యూర్! అయినా ఆమె గుండె నిబ్బరం సడలలేదు. తనకెటువంటి ట్రీట్‌మెంట్ వద్దంది. అయినా తమ ప్రయత్నం తాము చేస్తున్నారు. అమెరికాలో ఉన్న అన్నకు ఈ వార్తని అందజేశాడు. ధన సహాయం తప్ప కనీసం రాలేని పరిస్థితి అన్నది. తల్లిని కనిపెట్టుకోవటం తప్ప ఎలా కాపాడుకోవాలో తెలీని అయోమయ పరిస్థితి సురేష్‌ది. ఎంతో మంది తమ ఇంట్లో ఉండి చదువుకున్నారు. బంధువర్గమైతేనేం... వారాలబ్బాయిలయితేనేం.. చాలామందిని అమ్మ ఆదరించింది, ఇప్పటికీ ఆదరిస్తూనే ఉంది. అన్నపూర్ణమ్మగారంటే ఊర్లో చాలా పేరు. ఆ పుణ్యమంతా ఏమైంది? దేవుడెందుకంత శిక్ష విధించాడామెకి? యాభైయ్యో పడిలోనే ఆమెని తీసుకెళ్లిపోదామనుకుంటున్నాడు.. తల్లి లేచినట్టు అనిపించేసరికి సురేష్ ఆలోచనలని కట్టిపెట్టి తల్లికి దగ్గరగా కదిలాడు.

"చిన్నోడా...మీ అన్నయ్య నుండి ఏమైనా సమాచారం వచ్చిందా?" ఆ ప్రశ్నలో తన కొడుకు వస్తున్నాడా? అన్న విషయం తెలుసుకోవాలన్నదే అన్నపూర్ణమ్మగారి ముఖ్యోద్దేశం.

"ఇప్పుడే ఫోన్ చేశాడు. నువ్వు పడుకొని ఉన్నావు. అందుకే మాట్లాడలేదు. త్వరలో వస్తానన్నాడు" రెండు ముక్కల్లో చెప్పాడు.

ఈ సమాధానం అమ్మకి అంత తృప్తినివ్వలేదని సురేష్‌కి అర్థమైంది.

"ఒరే.. మన హరి కనబడి చాలా రోజులైంది. కాస్త కబుర్లేమైనా..."

కాస్త బోగట్టా చెయ్యకూడదూ..."

అమ్మ అన్న ఈ మాటలకి సురేష్‌కి ఒక్కసారిగా ఆశ్చర్యం వేసింది. హరి ఇప్పుడు అమ్మకి ఎందుకు గుర్తుకొచ్చాడూ? హరంటే అమ్మకి ప్రత్యేక అభిమానం అన్న విషయం తెలియంది కాదు. తమ చిన్నప్పుడు ఎంతో మంది అనాథల్ని అమ్మ ఆదరించింది. అందులో హరి ఒకడు. వారాలబ్బాయిగా ఇంట్లో ఉండి చదువుకున్నాడు. ఆ పనీ ఈ పనీ చేస్తూ అమ్మకి తలలో నాల్కలా ఉండేవాడు. హరి ఓ వారాలబ్బాయిగానే కాకుండా తన కొడుకులతో సమంగా చూసుకొనేది. పండగలకి కొత్త బట్టలు కొన్న సందర్భాలు కూడా లేకపోలేదు. హరి కూడా అమ్మ మాట జవదాటేవాడు కాదు. అమ్మ దీవెనల బలమో, అతడి అదృష్టమో ఇప్పుడు మంచి పొజిషన్‌లో ఉన్నాడు. నెలకొకసారైనా వచ్చి అమ్మని కలసి వెళ్లేవాడు. అలాంటి హరి ఈమధ్య కొన్ని నెలలుగా కనబడ్డం లేదు. అమ్మ పరిస్థితి తెలిస్తే ఎంత బాధపడతాడో...అనుకున్నాడు సురేష్.

"లేదమ్మా, ఈమధ్య అతడు నాకు తారసపడలేదు. కనిపిస్తే తప్పకుండా నువ్వడిగినట్టు చెప్తాలే"

"మరేం లేదు. ఈ పరిస్థితిలో నీకు కాస్త తోడుంటాడనీ...సరే.. ఏం చేస్తాం" నిరాశ ధ్వనించింది అన్నపూర్ణమ్మగారి మాటల్లో.

* * *

"సురేష్... ప్రయత్నించని చోటంటూ లేదయ్యా. ఇండియాలోనే గాక బయట కూడా ట్రై చేశాను, ఇంకా చేస్తూనే ఉన్నాను. సూటైన కిడ్నీ దొరకడమంటే మాటలు కాదుగా. ఇక ఆ దేవుడే ఏదో దారి చూపాలి" ఆశాభావానికి ఆస్కారం లేకుండా ఉన్నాయి డాక్టర్ మాటలు.

"సార్.. మీరే అలా అంటే.. ఇక మా మాటేమిటి?"

"లేదు సురేష్. ఆ తల్లికి... ఏదో మార్గం దొరక్కపోదు. మీరేమీ అనుకోనంటే ఒక మాట... మీ అన్నదమ్ముల్లో ఎవరో ఒకరు ఎందుకు డోనర్స్ కాకూడదు"

"డాక్టర్.." అన్న కేక అప్రయత్నంగా సురేష్ నోట వెలువడింది.

సురేష్ ఈ విషయం కల్లో కూడా ఆలోచించలేదని డాక్టర్‌కి అర్థమైంది. తల్లి దగ్గరుండి ఆమె పడుతున్న బాధ చూస్తున్న సురేష్ మాటే ఇలా ఉంటే, ఎప్పుడో దేశాన్ని విడిచిపెట్టి ప్రతీదీ డబ్బుతో మాట్లాడే ఇక వెంకటేష్ విషయం ఆలోచించడం వేస్టని అనుకున్నారు.

"ఆ.. పేపర్ ప్రకటన ఇచ్చి కూడా చూద్దాం" మాట మారుస్తూ అన్నారు డాక్టర్.


"ఊ.." అన్యమనస్కంగా పైకి అని వెళ్లడానికి లేచాడు. సురేష్ వైపు జాలిగా చూశారు డాక్టర్.

* * *

"అన్నా.. డాక్టర్ని ఇవాళ కలిశాను. కిడ్నీ డోనర్ దొరికేవరకూ ఆశ అంతంత మాత్రమేనని డాక్టర్ చెప్పకనే చెప్పారు. పేపర్ యాడ్ కూడా ఇచ్చి చూద్దాం అన్నారు. డాక్టర్ ఓ మాట కూడా అన్నారు" అని ఫోన్‌లోనే కాసేపాగాడు సురేష్.

"వాట్ డిడ్ హీ సే..." ఆతృతగా అడిగాడు వెంకటేష్.

కారంపూడి వెంకట రామదాస్



"అదీ.. అదీ.. మనిద్దరిలో ఒకరు ఎందుకు కిడ్నీ డోనర్ కాకూడదని?"

"వాట్...!"

అన్నకీ విషయం చెప్పడం తన ధర్మంగా తలచి చెప్పాడు గానీ, జవాబు ఊహించిందేనని మనసులో అనుకున్నాడు.

"హలో.. హలో.."

అటు నుండి ఏ జవాబూ రాకపోవడంతో అన్నాడు సురేష్.

లైన్ కట్ అయిందో, అన్న చేయాలని కట్ చేశాడో అర్థం కాలేదు సురేష్‌కి.

* * *

తల్లి పరిస్థితి దయాలసిస్ వరకు రావడం సురేష్‌ని కలచివేస్తున్నది. అయినా ఏం చెయ్యలేని నిస్సహాయస్థితి.

మొబైల్ ఫోన్ మ్రోగేసరికి ఎవరా అని చూస్తే డాక్టర్ పేరు కనబడింది. వెంటనే రెస్పాండయ్యాడు.

"మిస్టర్ సురేష్... గుడ్ న్యూస్..అద్భుతం.. మనకి కావల్సిన కిడ్నీ దొరికింది. నిజంగా మీ అమ్మ అదృష్టవంతురాలు" ఉత్సాహంగా చెప్పుకుపోయారు డాక్టర్.

"నిజంగానా.. డాక్టర్! ఇట్స్ ఫెంటాస్టిక్. నాకు చాలా ఆనందంగా ఉంది. ఈ శుభవార్త ముందు అమ్మకి చెప్పాలి. తరువాత అన్నకి ఫోన్ చేసి చెప్పాలి. ఇంతకీ ఆ దాత ఎవరు సార్?" ఆ మహానుభావుడు ఎవరో తెలుసుకోవాలని ఉత్సుకతగా అడిగాడు.

"నో.. సురేష్.. ఆ వివరాలు చాలా సీక్రెట్. దాత రిక్వెస్ట్ ప్రకారం ఆ వివరాలు చాలా గోప్యంగా ఉంచాలి. ప్లీజ్.. డోంట్ ట్రై టు నో దోజ్ డీటైల్స్. ఐయామ్..సారీ..."

"ఎనీవే డాక్టర్... ఐయామ్ హ్యాపీ. ఆ.. ఒక్క మాట డాక్టర్! వరాలిచ్చే ఆ దేవుడు మనకి కనబడుతున్నాడా? అలాగే... ఈ దేవుడు కూడా"

డాక్టర్ నవ్వి.. "సరే.. నువొక్కసారి హాస్పిటల్‌కొస్తే మిగతా విషయాలు మాట్లాడాలి ఉంటా" అని ఫోన్ కట్ చేశారు.

"అమ్మా.. శుభవార్త! ఇప్పుడే డాక్టర్ ఫోన్ చేశారు. ఎవరో దాత ముందుకొచ్చి కిడ్నీ ఇస్తామన్నారట. ఇక నీకు నయమైనట్టే. ఇప్పుడు నాకు చాలా సంతోషంగా ఉందమ్మా..."

ఈ వార్తకి అన్నపూర్ణమ్మగారి మొహంలో వెలుగు ఒక్కసారిగా తళుక్కుమంది. ఆ వెంటనే విచారం తొంగి చూసింది. ఆ విచారానికి కారణం, ఆ దాతెవరో కానీ తన ప్రాణంకి ఎంతో ముప్పుందనీ తెలిసీ కూడా ఆ సాహసానికి పూనుకున్నాడంటే ఆ త్యాగం సామాన్యమైంది కాదు. తన మూలంగా ఓ జీవి జీవిత కాలం తగ్గిపోయిందన్న బాధ ఆమెలో ఆ క్షణాన చోటుచేసుకుంది.

"చిన్నోడా.. ఆ దాతెవరురా? కనబడితే చేతులెత్తి మొక్కాలనుంది"

"అదే తెలీదమ్మా...దాత, వివరాలు చాలా గోప్యమట!"

"అయ్యో...నా దురదృష్టం. కృతజ్ఞతలు చెప్పుకునే అవకాశం కూడా లేదే" వాపోయారు అన్నపూర్ణమ్మగారు.

"అమ్మా.. అన్నయ్యకీ శుభవార్త ఫోన్ చేసి చెప్తా" అంటూ మొబైల్ నుండి రింగ్ చేశాడు సురేష్.

"అన్నయ్యా.. వెరీ వెరీ గుడ్ న్యూస్. ఇప్పుడే డాక్టర్ ఫోన్ చేశారు. కిడ్నీ డోనర్ దొరికారంట" అని ఒక్క క్షణం ఆగాడు సురేష్.

"ఈజ్ యిట్? చాలా సంతోషించవలసిన విషయం. డోంట్ మైండ్ ఫర్ మనీ. ఆపరేషన్‌కి ఏర్పాట్లు చెయ్యి" గుక్క తిప్పుకోకుండా అన్నాడు వెంకటేష్.

"ఓ.కే.. నువ్వు కూడా ఆ టైమ్‌కి రావాలి"

"ఆ నాకు కుదిరేటట్టు లేదు. అయినా వీలు చూసుకుని కాస్త అటు ఇటుగా వస్తాలే"

ఈ జవాబుకి నీరుగారిపోయాడు సురేష్. ఇంత ఇంపార్టెంట్ ఆపరేషన్ సమయంలో కూడా రాకపోతే అర్థమేంటి? మనసులోనే అనుకున్నాడు.

"అది కాదూ నేనొక్కడ్నే ఇవన్నీ చూసుకోవాలంటే చాలా కష్టం. అందుకే నువ్వొస్తే నాకూ తోడుంటుంది ఇటు అమ్మక్కూడా ధైర్యంగా ఉంటుంది."

"లేదు సురేష్. ఆ రోజుకి నాక్కుదరదు. వీలైనంత త్వరలో వస్తానన్నాగా. ఆ నీకు సహాయంగా ఎవరినైనా చూసి ఏర్పాటు చేసుకో"

అన్న అంత ఖచ్చితంగా చెప్పాకా బలవంతం చేసీ లాభం లేదనుకున్నాడు సురేష్. ఇక సహాయం అంటే వెంటనే హరి గుర్తుకొచ్చాడు.

"సరే..ఆ.. అన్నట్టు మన హరి ఉన్నాడుగా అతని హెల్ప్ తీసుకుంటాలే. వుంటా.." అని ఫోన్ పెట్టే శాడు.

తల్లికిప్పుడే అన్న రావడం లేదనే వార్త చెప్పకూడ దనుకున్నాడు సురేష్. అలాగే హరిని కూడా కలవా లని నిశ్చయించుకున్నాడు.

* * *

హరి ఇల్లు వెతుక్కుంటూ వెళ్లిన సురేష్ పెద్ద కష్టం లేకుండానే పట్టుకున్నాడు.

గేటు తీసుకుని లోపలికి అడుగు పెడుతుంటే, ఆ చప్పుడుకి లోపలున్న హరి బయటకి రావడం చూశాడు సురేష్. హమ్మయ్య...! హరి ఇంట్లోనే ఉన్నాడు అని మనసులో అనుకున్నాడు.

"అరే.. సురేష్..నువ్వా..రా..రా.." అంటూ లోప లికి ఆహ్వానించాడు హరి. సోఫా చూపించీ కూర్చో మన్నాడు.

సోఫాలో చతిగిలబడిన సురేష్ హరి భార్య అందించిన నీళ్లు తాగీ వచ్చిన పని గూర్చీ అందుకు న్నాడు.

"హరీ.. నీకో విషయం చెప్పడానికొచ్చా. అమ్మకి కిడ్నీ ఫెయిలైంది. అయితే, లక్కీగా ఓ దాత దొరక దంతో గండం గడి చింది"

"ఏంటీ..అమ్మ కంత ఆపదొ చ్చిందా?" బాధతో అన్నాడు హరి.

"ఆ అన్న స్టేట్స్‌లో ఉన్న విషయం నీకు తెలిసిందే. నేనొక్కడ్నే ఇక్కడ అందుకే నీ హెల్ప్ కోసమొచ్చా"

"హెల్పా..ఏంటదీ..?"

"అదే.. ఆపరేషన్ టైమ్‌లో నువ్వో నాలుగు రోజులు నాతో పాటు హాస్పిటల్లో ఉండాలి" అసలు విషయం చెప్పాడు సురేష్.

"ఆపరేషన్ ఎప్పుడు?"

"ఈ నెల పదిహేను. అన్నకి వీలుకాదని ఫోన్ చేశాడు. అందుకే నిన్ను రిక్వెస్ట్ చేస్తున్నా"

"ఈ నెల పదిహేనా? అంటే.. మరో మూడ్రో జులే. అర్రె...సరిగ్గా మా హెడ్డాఫీసులో అన్యువల్ సేల్స్ కాన్ఫరెన్స్ ఉంది. ఏజ్ ఏ హెడ్డాఫ్ ద రీజన్ ఐ మస్ట్ ఎటండ్ ద కాన్ఫరెన్స్ వితవుట్ ఫెయిల్. వారం రోజులు అక్కడ కంపల్సరీగా ఉండాలి. రిజర్వేషన్ కూడా మా హెడ్డాఫీసువాళ్లే చేసేశారు. ఈ రాత్రికే ప్రయాణం. ఐ యామ్ సారీ.. రిటర్న్ రాగానే అమ్మని చూస్తాను" నొచ్చుకుంటూ అన్నాడు హరి.

హరి అలా అనేసరికి ఏం మాట్లాడాలో తోచలేదు సురేష్‌కి. లాభం లేదని నీరసంగా అక్కడి నుండీ బయలుదేరాడు. హరిలా హేండిస్తాడని ఊహించ లేదు. ఒకింత కోపం కూడా వచ్చింది. తమాయించు కున్నాడు సరే.. అంతా తన దురదృష్టం అనుకు న్నాడు.

* * *

ఆపరేషన్ జరిగింది.. సక్సెస్ అయింది. అన్నపూర్ణ మ్మగారికి అపాయం తప్పింది. సురేష్‌తో పాటూ ఆమె కూడా ఆ దాతకి మనసులోనే కృతజ్ఞతలు చెప్పు కున్నారు. నిజానికి ఆ దాతే ఈ రోజు అమ్మని కాపా డింది. తన విధిగా దగ్గరుండీ అంతా చూసుకున్నాడు అంతే. ఇక అన్న డబ్బుతో రుణం తీర్చుకున్నాడు. సమయానికి రాకపోయినా ఇవాళో రేపో వచ్చి అమ్మని చూసి వెళతాడు. ఇదే.. కొడుకులుగా తాము అమ్మకి చేసింది. అసలంతా చేసింది ఆ దాత! ఎవరో ఆ మహానుభావుడు? ఎన్ని సార్లు మొక్కినా రుణం తీరదు మనసులో అనుకున్నాడు సురేష్.

అన్నపూర్ణమ్మని డిశ్చార్జ్ చేయడం, ఇటు వెంక టేష్ ఫేమ్లీ స్టేట్స్ నుండీ రావడం ఒకేరోజు జరిగాయి. పెద్దకొడుకుని పట్టుకునీ అమ్మ ఏడ్వడం చూస్తే సురే ష్‌కీ కళ్లు చెమర్చాయి.

ఆ రోజు...

అత్తగారి కోసం బత్తాయి జ్యూస్ తీస్తోంది సురేష్ భార్య. వెంకటేష్ భార్య హెల్ప్ చేస్తోంది. పిల్లలు నానమ్మ దగ్గర కూర్చునీ ఆమెతో కబుర్లు చెప్తున్నారు. డాక్టర్ రాకకోసం ఎదురుచూస్తున్నారు అన్నదమ్ములి ద్దరూ.

"అత్తగారు చాలా అదృష్టవంతురాలు కాబట్టి తిరిగి బట్టకట్టారు. ఆ దాత మాటటుంచితే, మా ఆయన దగ్గరుండీ అన్నీ చూడబట్టీ ఈ గండం గట్టె క్కింది. సమయానికి ఉండవలసిన వాళ్లు ఉండక పోయే" అంటూ సురేష్ భార్య తామే అంతా చేశా మని గొప్పగా చెప్పింది.

ఇదంతా తమనుద్దేశించే ఆమె అందని ఉదు క్కున్న వెంకటేష్ భార్య వెంటనే అందుకుంది.

"బాగుంది సమయానికి వీలుకాక రాలేదుకానీ.. ఎప్పటికప్పుడు అత్తగారి ఆరోగ్యం వాకబు చేస్తూ ఉండనే ఉన్నాం. ఆపరేషన్‌కైన లక్షలు ఎవరు పెట్టారూ?" అంటూ తామేమీ తక్కువ చెయ్యలేదని చెప్పుకొచ్చింది.

అన్నదమ్ములిద్దరూ అసహనంగా వారి వాదన వింటున్నారు.

ఇంతలో డాక్టర్ వచ్చీ అన్నపూర్ణమ్మకి ఇంజక్షన్ చేశారు. అంతా నార్మల్‌గా ఉందని సంతృప్తి వ్యక్తం చేశారు.

సరిగ్గా అప్పుడే అక్కడికి హరి అడుగు పెట్టాడు. ఎందుకో అతడి మొహంలో జీవకళ లేదు. మనిషి చాలా నీరసంగా కనబడుతున్నాడు.

హరిని చూస్తే సురేష్‌కి ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది. ఇన్నాళ్లూ ఎక్కడకి పోయాడో ఇప్పుడు అమ్మని చూడ్డానికి పెద్ద వచ్చాడు అన్నం పెట్టిన ఆ తల్లి చావుబ్రతుకుల్లో ఉంటే చూడ్డాని



## ఇదో సబ్బుల పిచ్చి!

మనం ఎక్కడికైనా కొత్త ప్రదేశానికి వెళ్తే ఏవో ఒకటి మనకి నచ్చినవి కొనుక్కుని వస్తుంటాం కదా! అమీషా పటేల్ ఎక్కడికెళ్లినా ముఖ్యంగా విదేశాలకి వెళ్లినప్పుడు రకరకాల సువాసనలు వెదజల్లే సబ్బులని కొనుక్కువస్తుందిట. ఆమె దగ్గర ఎప్పుడూ దాదాపు 500 రకాలైన సబ్బుల కలెక్షన్ సిద్ధంగా వుంటుందిట. హార్ట్‌షేప్, ఫ్లవర్ షేప్ లాంటి వెరైటీ ఆకారాల్లోని సోప్‌లు, ఆహ్లాదాన్నిచ్చే వింత పరి మళంతో వుండే సబ్బులంటే అమీషాకి తెగ మోజట. అంద కనే ఎక్కడికెళ్లినా తన షాపింగ్‌లో మెయిన్ ఐటమ్ సోప్‌లే వుంటాయిట.

క్కడా రాకుండా గుప్‌చుప్‌గా ఇప్పుడు వచ్చాడు. అందుకే నాలుగు దులిపేయాలని నిశ్చయించుకున్నాడు.

వెంకటేష్ కూడా హరిని చూసీ మొహం చిట్లించాడు.

"ఏం..హరీ.. ఇప్పుడైనా నీకు తీరిక దొరికిందా? అమ్మకి ప్రాణం మీదికొస్తే మీలో ఒక్కరంటే ఒక్కరు.. ఆదుకున్నారా? మీరెలా పైకొచ్చారో అన్న సంగతి మరచిపోయారా? నీ ఇంటికొచ్చీ విషయం వివరించినా నీకు మనసు కరగలేదా.. ఏం చేద్దామని ఇప్పుడొచ్చావు?" కటువుగా అన్నాడు సురేష్.

"ఏంట్రా ఆ మాటలు?" అంత నీరసంలోనూ కొడుకుని వారించేరు అన్నపూర్ణమ్మగారు.

"చూడ్రా.. ఆ తల్లి మనసు. నిన్ను ఒక్క మాట అననివ్వలేదు"

హరి ఇదంతా మౌనంగా భరిస్తున్నాడు.

ఇదంతా చూస్తున్న డాక్టర్ తట్టుకోలేకపోయారు. అతడు సహనం కోల్పోయాడు.

"వాట్..మిస్టర్ సురేష్... ఎవర్ని ఏం అంటున్నావో తెలుసా?" అంటూ ఏదో చెప్పబోతున్న డాక్టర్ని వారించబోయాడు హరి.

"నేనిక ఊరుకోలేను హరీ.. నీకు జరుగుతున్న అవమానాన్ని చూస్తూ ఇక మౌనంగా ఉండలేను" అన్నాడు డాక్టర్.

డాక్టర్ మాటలు ఏమీ అర్థంకాక అన్నదమ్ములిద్దరూ అతడికేసి అయోమయంగా చూశారు.

"అసలేం జరిగిందో తెలుసా..? మనం పేపరు యాడ్ ఇచ్చాం గుర్తుందా?" అంటూ చెప్పుకొచ్చారు డాక్టర్.

★ ★ ★

"సార్.. వాటీజ్ దిస్... పేపరేడ్ ఇచ్చింది మన అన్నపూర్ణమ్మగారి గురించేనా?" బాధని దిగమింగుకుంటూ అన్నాడు హరి.

"అవును హరీ! అన్ని ప్రయత్నాలూ చేస్తున్నాం. అందరం అన్ని వైపులనుండీ ట్రై చేస్తున్నాం. కానీ దాత దొరకొద్దూ..."

"సార్.. నేను కిడ్నీ ఇవ్వడానికి సిద్ధమే" మారు ఆలోచించకుండా అన్న హరి మాటలకి డాక్టర్ నిర్ఘాంతపోయారు. ఇంతకీ హరి అన్నపూర్ణమ్మగారికి ఏం అవుతాడనీ? ఎప్పుడో చిన్నప్పుడు ఆమె ఇంత ముద్ద పెట్టిందనీ ఇంత త్యాగమా? అన్నపూర్ణమ్మ కొడుకులకి తాను చెప్పినా వాళ్లా ఆలోచన చేయలేదు. మరి హరో? ముందూ వెనకా ఆలోచించకుండా తిరుగులేని నిర్ణయం తీసుకున్నాడు. ఎంత విశ్వాసం.! ఏం అయినా హేట్సాఫ్...హరీ! అని మనసులో అనుకోకుండా ఉండలేకపోయారు డాక్టర్.

"అన్నీ తెలిసే ఈ మాటంటున్నావా?"

"అవును సార్.."

"సరే.. కొన్ని టెస్ట్స్ చెయ్యాలి. అందులో పాజిటివ్ రిపోర్టొస్తేనే నీ కిడ్నీ ఆమెకి పనికొస్తుంది."

"చేసుకోండి సార్. ఎన్ని టెస్ట్‌లయినా చేసుకోండి. అన్నపూర్ణమ్మగారు మనకి దక్కాలి అంతే" అన్నాడు స్థిరంగా హరి.

టెస్ట్లు జరిగాయి కానీ దురదృష్టవశాత్తూ హరి కిడ్నీ అన్నపూర్ణమ్మగారికి సరిపోలేదు. అప్పుడు హరి పడ్డ బాధ అంతా ఇంతా కాదు. అక్కడితో హరి ఊరుకోలేదు. తన ప్రయత్నం మానలేదు. భర్త పడుతున్న మానసిక వేదన చూసి హరి భార్య తట్టుకోలేకపోయింది. ఏదో ఒకటి చెయ్యకపోతే భర్త పిచ్చివాడైపోతాడని ఆమె తిరుగులేని నిర్ణయం తీసుకుంది. అదే...! తన కిడ్నీ ఇవ్వడానికి సిద్ధపడింది. మన స్ఫూర్తిగా తన భార్య తీసుకున్న నిర్ణయానికి హరి ఆనందించాడు.

చ క చ కా టెస్టులూ చేసి ఆమె కిడ్నీ అన్నపూర్ణమ్మగారికి సరిపోతుందని తెలుసుకుని మేమంతా హాయిగా ఊపిరి పీల్చుకున్నాం.

★ ★ ★

డాక్టర్ చెప్పడం ఆపాకా అక్కడంతా నిశ్శబ్దం ఆవరించింది. ఎవరి నోటా మాట రాలేదు. ముందుగా తేరుకున్నది అన్నపూర్ణమ్మగారే. వెంటనే లేని సత్తువని తెచ్చుకొని లేచొచ్చి హరిని కౌగిలించుకుని కన్నీళ్లు కార్చారు.

"ఎందుకురా ఇంత త్యాగానికి పాల్పడ్డారు. తీర్చేసుకున్నావురా.. నీ రుణాన్ని తీర్చేసుకున్నావు. ఇప్పుడు నేనే నీకు రుణపడి ఉన్నాను. ఇంత సాహసానికి పూనుకున్న నీ భార్యని వెంటనే చూడాలి. ఆమె పాదాలని నా కన్నీటిధారలతో కడగాలి" ఉద్వేగంగా అన్నారు అన్నపూర్ణమ్మగారు.

"లేదమ్మా, నీ రుణం ఈ జన్మలో తీరేది కాదు. నువ్వు బ్రతికితే మా లాంటి ఎందరో దిక్కులేని వారి జీవితాలు బాగుపడతాయి. అందుకోసమైనా నువ్వు బ్రతకాలి. అందుకే నిన్ను కాపాడుకున్నాం చూశావా.. ఒక విధంగా ఇది త్యాగం కాదు. స్వార్థమేమో! ముందే నీకీ విషయం తెలిస్తే నువ్వొప్పుకోవు. అందుకే చెప్పలేదు. నా భార్యకి తోడుండడానికే సురేష్ సహాయం అడిగినా సాకుతో నిరాకరించాను"

అంటూ కన్నీటితో తల్లిని ఓదారుస్తున్న హరి వైపు సూటిగా చూసే ధైర్యం చాలలేదు వెంకటేష్, సురేష్‌లకి.

డాక్టర్ వారిస్తున్నా వినకుండా హాస్పిటల్లో ఉన్న హరి భార్యని చూడ్డానికి అందరితో పాటూ అన్నపూర్ణమ్మగారు కూడా బయలుదేరారు.



## భూమిక పెళ్లి?

అంతర్జాతీయంగా పేరు పొందిన తన యోగా గురువు అంటే భూమికకు ఎనలేని గౌరవం అనేది సినిమా జనాల్ని ఎవర్ని కదిపినా చెబుతారు. ఆ గౌరవం ప్రేమ వరకూ దారి తీసిందనేది ఓ వార్తయితే- వీరి పెళ్లి అతి త్వరలోనే జరగవచ్చనేది తాజా సమాచారం. భూమిక తన యోగా గురువు భరత్ ఠాకూర్ అంటే తెగ ఇదైపోతోందంటున్నారు. భూమిక తను ఇప్పటిదాకా ఒప్పుకున్న సినిమాల్ని త్వరగా పూర్తిచేసేసి భరత్‌తో ఆ మూడు ముళ్లూ వేయించేసుకోబోతోందని ఆమె సన్నిహితులు అంటున్నారు. శుభం!